సాక్షి అనకాపల్లి

సోమవారం । 2 । జూన్ । 2025

అయ్యన్నకు వడ్డీతో సహా తిరిగిస్తాం



వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు ఈశ్వరరావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్



స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో రౌడీ షీటర్ దిగిన ఫొటో చూపుతున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

8లో

న్యూస్‌రీల్

ప్రశాంతంగా కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష



పరీక్ష కేంద్రం వద్ద సూచనలిస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

అల్లిపురం(విశాఖ): పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన పోలీస్ కానిస్టేబుల్(సివిల్, ఏపీఎస్పీ) మెయిన్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నగరంలో మొత్తం 27 పరీక్ష కేంద్రాల్లో మెయిన్స్ పరీక్ష నిర్వహించారు. మెయిన్స్‌కు 12,491 మంది అర్హత సాధించగా, 11,338 మంది మాత్రమే హాజరయ్యారు. అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించి, కేంద్రాల లోపలకు అనుమతించారు. నగర ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్, విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, డీసీపీ-1(లా అండ్ ఆర్డర్) అజితా వేజెండ్ల, డీసీపీ-2 (లా అండ్ ఆర్డర్) డి.మేరి ప్రశాంతి, డీసీపీ (అడ్మిన్) శ్రీ కృష్ణకాంత్ పటేల్‌లు పలు కేంద్రాలను తనిఖీలు చేసి, పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు.

విశాఖ చేరిన డబుల్ డెక్కర్ బస్సు



శ్రీకృష్ణాపురంలోని గోశాలలో చార్జింగ్ కోసం వచ్చిన ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సు

సింహాచలం: విశాఖ వీధుల్లో డబుల్ డెక్కర్ బస్సు కనువిందు చేయనుంది. పర్యాటకులకు కొత్త అనుభూతిని పంచనుంది. విశాఖలో పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు డబుల్ డెక్కర్ బస్సు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఎలక్ట్రికల్ డబుల్ డెక్కర్ బస్సు విశాఖకు చేరుకుంది. హనుమంతవాక నుంచి పాత అడవివరం వైపు ఉన్న బీఆర్‌టీఎస్ రోడ్డులో కనువిందు చేస్తూ సింహాచలం దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలకు చార్జింగ్ కోసం ఆదివారం వచ్చింది. గోశాల ముఖద్వారం గేటు బస్సు కన్నా తక్కువ ఎత్తులో ఉండటంతో లోపలికి వెళ్లలేదు. గేటు బయటనే నిలిచింది. దాంతో బీఆర్‌టీఎస్ రోడ్డులో సింహాచలం వైపు వచ్చే వారంతా బస్సును ఆసక్తిగా తిలకించారు. గన్నవరం నియోజకర్గంలోని మల్లివల్లిలో అశోక్ లేల్యాండ్ బస్ బాడీ ప్లాంట్ ప్రారంభమైన నేపథ్యంలో ఆ కంపెనీ తయారుచేసిన డబుల్ డెక్కర్ బస్సును ఏపీ ప్రభుత్వానికి సంస్థ ఉచితంగా అందించింది. దాన్ని విశాఖకు కేటాయించారు.



రాష్ట్ర ప్రజలకు కూటమి సర్కార్ వెన్నుపోటు 8లో
మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

పేదల సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన గృహాలపై కూటమి ప్రభుత్వం శీతకన్నేసింది. ఆ ఇళ్లు పూర్తయితే ఎక్కడ వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డికి పేరు వస్తుందోనన్న అక్కసుతో వాటికి ఏడాదిగా బిల్లులు **మంజూరు చేయడం లేదు. దీంతో చాలా ఇళ్లు మొండిగోడలతో దర్శనమిస్తున్నాయి. ఇళ్ల నిర్మాణం పూర్తయితే శాశ్వత చిరునామా దొరుకుతుందన్న బడుగుల ఆశలకు కూటమి ప్రభుత్వం గండికొడుతోంది.**



ఈ ఫొటోలో ఉన్నది అనకాపల్లి మండలం మూలపేట గ్రామానికి చెందిన నల్ల సంతోషి ఇంటి పునాది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీలో ఉచితంగా సెంటున్నర స్థలం, ఇల్లు మంజూరు చేశారు. అప్పుడు పునాది వరకూ నిర్మాణం చేపట్టారు. కూటమి ప్రభుత్వంలో బిల్లులు రాకపోవడంతో పునాది దశలోనే ఆగిపోయింది. స్థానికంగా సచివాలయ, హౌసింగ్ అధికారులకు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకపోయింది.దీంతో ఇల్లు నిర్మించుకోవాలనే సంతోషి ఆశ నిరాశగానే మిగిలి పోయింది.



సంతోషి

పేదల గూడు... పట్టదు గోడు



తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు రెండు సెంట్ల స్థలం ఇచ్చి, ఇల్లు కట్టిస్తాం. ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేస్తాం. ఆ బాధ్యత నేను తీసుకుంటాను. జగన్ ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాలను రద్దు చేయబోం.

- పాయకరావుపేట ఎన్నికల ప్రచార సభలో చంద్రబాబు హామీ

- పేదలను దగా చేసిన కూటమి ప్రభుత్వం
- ఏడాది పాలనలో దయనీయ పరిస్థితులు ఎదుర్కొంటున్న ప్రజలు
- ఇంటి కోసం ఒక్కరికీ సెంటు స్థలం కూడా ఇవ్వని పరిస్థితి
- గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లకు బిల్లుల నిలిపివేత
- సగంలోనే నిలిచిపోయిన వందలాది ఇళ్లు
- జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించని సర్కార్
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లాలో 682 జగనన్నకాలనీలు అభివృద్ధి
- సుమారు 58,571 ఇళ్లు మంజూరు
- 24,060 మందికి ఇళ్ల స్థలాల పంపిణీ

సాక్షి, అనకాపల్లి: ప్రతి పేదవాడి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని సీఎం చంద్రబాబు నాయుడు నిత్యం ఊదరగొడతారు. ఈ ఏడాది కాలంలో ఆయన మాటలను, పాలనను పరిశీలిస్తే పొంతన లేదని ఎవరికైనా ఇట్టే తెలిసిపోతుంది. బోగస్ హామీలు, మాయ మాటలు ఆయన సొత్తని రుజువు అవుతుంది. దానికి ప్రబల ఉదాహరణ పేదల ఇళ్లు. రెండు సెంట్ల స్థలం, రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు కనీసం ఆ ఊసే ఎత్తడం లేదు. ఈ ఏడాది కాలంలో ఒక్క ఇల్లు, సెంటు స్థలం మంజూరు చేయకపోగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన ఇళ్లకు బిల్లులు నిలిపివేసి ఘనతకెక్కారు. ఆయా కాలనీల్లో కనీస వసతులు కల్పించకుండా పేదల బతుకులతో ఆటలాడుకుంటున్నారు. పేదోడి సొంతింటి కల సాకారమయ్యేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉచితంగా స్థలం అందజేయడంతో పాటు ప్రభుత్వమే ఇళ్ల నిర్మాణం చేపట్టింది. ప్రతి గ్రామంలో జగనన్న కాలనీల పేరిట కొత్త ఊళ్లు వెలిశాయి. మీ ఇల్లెక్కడ.. అంటే సమాధానం చెప్పుకోలేని నిరుపేదలకు జగనన్నకాలనీల్లో శాశ్వత చిరునామాలు లభించాయి. తనకు ఓ ఇల్లు ఉందని పేదోడు గర్వంగా తలెత్తుకుని చెప్పుకునే విధంగా అర్హతున్న ప్రతి ఒక్కరికీ సెంటున్నర స్థలాన్ని ఇచ్చి ఇంటి నిర్మాణం చేపట్టారు. రాజకీయాలతీతంగా, పార్టీ జెండా చూడకుండా పేదోడనే అర్హతే ప్రామాణికంగా వై.ఎస్. జగన్ సర్కార్ ఇళ్లు మంజూరు చేస్తే..కూటమి ఏడాది పాలనలో పేదల ఇళ్ల నిర్మాణ బిల్లులను కూడా నిలిపివేసింది. రెండు సెంట్లు స్థలం ఉచితంగా ఇస్తామనే ఎన్నికల హామీని గద్దెనెక్కిన తర్వాత అలవాటు ప్రకారం విస్మరించింది. ఉన్నవి పోయి... కొత్తవి రాక దిక్కుతోచని స్థితిలో ప్రజలు ఉన్నారు.

జిల్లాలో వివరాలు ఇలా..

వైఎస్ జగన్ ప్రభుత్వంలో కేటాయించిన స్థలం 2,464.76 ఎకరాలు	లబ్ధిదారులు 24,060 మంది
ఏర్పాటైన కాలనీలు 682	మంజూరైన ఇళ్లు 58,571
నిర్మాణం పూర్తయినవి 37,366	బేస్ మెంట్ లెవెల్‌లో ఉన్నవి 18,212
ప్రారంభం కాని గృహాలు 2,993	

మౌలిక సదుపాయాలు లేవు..



కోటవురట్ల మండల కేంద్రంలో పెట్రోల్ బంక్ వెనక ఉన్న జగనన్న కాలనీలో ఏడాదిగా కనీస సదుపాయలు కల్పించలేదు. గత ప్రభుత్వంలో నాకు సెంటున్నర స్థలం ఉచితంగా ఇచ్చారు. ఇల్లు కూడా మంజూరు చేశారు. గతంలోనే ఇంటి నిర్మాణం పూర్తయింది. కాలనీలో విద్యుత్ స్తంభాలు, లైన్లు ఏర్పాటు చేశారు. అంతలో ప్రభుత్వం మారింది. ఏడాది అవుతున్నా మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ఇంటర్నల్ రోడ్లు లేకపోవడంతో వర్షాలకు కాలనీలోపలికి వెళ్లేందుకు ఇబ్బందులకు గురవుతున్నాం. విద్యుత్ సరఫరా కూడా ఇవ్వలేదు. మెయిన్ రోడ్ నుంచి కాలనీకి అప్రోచ్ రోడ్డు ఇప్పటివరకు నిర్మించలేదు. నీళ్లు, రోడ్లు, విద్యుత్ సరఫరా లేకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

– దమ్ము వెంకటేష్, కోటవురట్ల

నాలుగు నెలలైనా బిల్లులివ్వలేదు



దేవరాపల్లి జగనన్న లేఅవుట్‌లో గత ప్రభుత్వ హయాంలో ఇంటి స్థలంతో పాటు పక్కా ఇల్లు మంజూరు చేశారు. గత ప్రభుత్వ హయాంలోనే పునాది, లింటల్, శ్లాబ్ లెవెల్ వరకు బిల్లులు మంజూరు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మిగిలిన పనులను చేపడితే తక్షణమే బిల్లులు ఇస్తామని అధికార్లు చెప్పడంతో అప్పు చేసి మరీ ప్లాస్టరింగ్ ఇతర నిర్మాణ పనులు చేపట్టాం. నాలుగు నెలలు గడుస్తున్నా బిల్లులు మంజూరు చేయడం లేదు. ఉపాధి హామీ పథకం నుంచి రావాల్సిన బిల్లులు సైతం ఇవ్వలేదు. ప్రస్తుతం అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నాం. నిర్మాణ పనులు చేయాలని హడావుడి చేసిన అధికారులను బిల్లుల కోసం అడిగితే స్పష్టమైన సమాధానం ఇవ్వడం లేదు. పేదల ఇళ్ల నిర్మాణంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడి తక్షణమే బిల్లులు మంజూరు చేయాలి.

– దాసరి సత్యవతి, పక్కా ఇళ్ల లబ్ధిదారు, దేవరాపల్లి

చినుకుపడితే చిత్తడే..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తిమ్మరాజు పేట జగనన్నకాలనీలో ఉచితంగా సెంటున్నర స్థలం ఇచ్చి, ఇల్లు మంజూరు చేశారు. గత ప్రభుత్వ హయాంలోనే మా కాలనీలో నాతో పాటు సుమారు 34 మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత నుంచి మా కాలనీలో రహదారి, డ్రైనేజీ సదుపాయం కల్పించలేదు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. వర్షాకాలం వస్తే ఇంటికళ్లే రహదారి బురదమయంగా ఉంటుంది.

– కోలమూరి బాబురావు, తిమ్మరాజుపేట, మునగకపాక మండలం

కనీస సదుపాయాలు కరువు..



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాకవరపాలెం జగనన్న కాలనీలో ఇల్లు కట్టుకున్నాను. మా కాలనీలో సుమారు 140 మందికి పట్టాలిచ్చారు. 20 మంది వరకూ ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. మిగతావారూ నిర్మిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏవైతే మౌలిక వసతులు కల్పించారో అంత మేరకే ఉన్నాయి. తాగునీటి కుళాయిలు, వీధిరోడ్లు, డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడుతున్నాం. కాలనీ శివారున ఒక బోర్‌ను అప్పుడే వేశారు. అదే తప్ప ఇతర సౌకర్యాలు లేవు.

– రుత్తల మంగ, మాకవరపాలెం గ్రామం



మునగపాకలో జగనన్న కాలనీ

జగనన్న కాలనీలపై కినుకు

ప్రతి పేదోడికి సొంతింటి కల నెరవేర్చాలనే ఆశయంతో గత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామంలో జగనన్న కాలనీల లేఅవుట్లు వేసి సెంటున్నర స్థలం ఇచ్చి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. అయితే ఆ కాలనీలపై కూటమి ప్రభుత్వం కినుకు వహించింది. వాటివైపు కన్నెత్తి చూడడం లేదు. కనీస మౌలిక వసతులు కల్పించలేదు. గతంలో వేసిన అంతర్గత రోడ్లకు ఇరువైపులా తుప్పలు పేరుకుపోయి ఉన్నా కనీసం తొలిగించే ప్రయత్నం కూడా అధికారులు చేయడంలేదు. జగనన్నకాలనీల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా గతంలో వాటర్ ట్యాంకలు,, విద్యుత్ స్తంభాలకు నిధులు మంజూరు చేశారు. కానీ ప్రభుత్వం మారడంతో ఆ పనులన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో ఇళ్ల లబ్ధిదారులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు.

210 కాలనీల్లో వసతులు కరువు

జిల్లా వ్యాప్తంగా 210 జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించకపోవడంతో లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. నాతవరం మండలంలో ఎనిమిది గ్రామాలు, గొలుగొండ మండలంలో 11 గ్రామాలు, కోటవురట్ల మండలంలో 12, రోలుగుంట మండలంలో 9, పాయకరావుపేట మండలంలో ఏడు, చోడవరం మండలంలో 11, అనకాపల్లి మండలంలో 15, కశింకోట మండలంలో మూడు, దేవరాపల్లి మండలంలో ఐదు, కె.కోటపాడులో నాలుగు, మాడుగుల మండలంలో మూడు, సబ్బవరం మండలంలో ఎనిమిది, అచ్యుతాపురం మండలంలో నాలుగు, మునగపాక మండలంలో నాలుగు, బుచ్చయ్యపేట మండలంలో ఆరు, రావికమతం మండలంలో ఏడు గ్రామాల్లోని జగనన్నకాలనీల్లో మౌలిక వసతులు కల్పించ లేదు. వర్షం వస్తే చాలు నీరు నిల్వ ఉండిపోయి అధ్వానంగా తయారవుతున్నాయి. కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్లు ఉన్నప్పటికీ ఇళ్లకు విద్యుత్ సరఫరా ఇవ్వలేదు. తాగునీటి సరఫరా లేదు. లే అవుట్ల లోకి వెళ్లాలంటే నానా అవస్థలు పడవలసి వస్తోంది. జిల్లాలో మొత్తం 682 కాలనీలను గత ప్రభుత్వం ఏర్పాటు చేయగా, ఈ కాలనీల్లో మొత్తం రూ.62.35 కోట్ల వ్యయంతో గృహ, వీధి దీపాలు, విద్యుత్ స్తంభాలు, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు వంటి మౌలిక వసతులను కల్పించింది. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేపట్టని 21,205 ఇళ్ల లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేయకుండా కూటమి ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది.

అనకాపల్లిలో టీడీపీ వర్సెస్ జనసేన



కోట్నివీధి రేషన్ డిపో-15 వద్ద ఉదయం 8 నుంచి 10 గంటల వరకు కూర్చున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ నాయకులు

- రేషన్ డిపో ప్రారంభంలో మాజీ ఎమ్మెల్యే పీలాకు తీవ్ర అవమానం
- ఎమ్మెల్యే కొణతాల కోసం 2 గంటలకు పైగా నిరీక్షణ
- చివరకు పీలా వెళ్లిన తరువాత ప్రారంభోత్సవానికి హాజరైన కొణతాల
- రుసరుసలాడుతూ వెనుదిరిగిన టీడీపీ శ్రేణులు

అనకాపల్లి: అనకాపల్లి నియోజకవర్గంలో టీడీపీ, జనసేన మధ్య వర్గ విభేదాలు బహిర్గతమయ్యాయి. ఆదివారం రేషన్ డిపోల పునః ప్రారంభంలో జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తీరుతో టీడీపీ మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణకు తీవ్ర అవమానం ఎదురైంది. అనకాపల్లి పట్టణం రైల్వే స్టేషన్ రహదారి కోట్నివీధి రేషన్ డిపో-15 పునః ప్రారంభించేందుకు ఉదయం 8 గంటలకే మాజీ ఎమ్మెల్యే పీలా, టీడీపీ నాయకులు చేరుకున్నారు. ఇంతలో జనసేన నాయకులు అక్కడికి చేరుకుని తమ ఎమ్మెల్యే కొణతాల వచ్చే వరకూ రేషన్ దుకాణాన్ని ప్రారంభించ వద్దని అక్కడే ఉన్న ప్రభుత్వ అధికారులకు చెప్పారు. దీంతో పీలా ఉదయం 10 గంటల వరకూ రేషన్ దుకాణం వద్దే కూర్చుని, కొణతాల కోసం నిరీక్షించారు. ఎప్పటికీ ఆయన రాకపోవడంతో సమయం అన్నసమైనది, తక్షణమే రేషన్ దుకాణాన్ని ప్రారంభించాలని అధికారులను పీలా కోరారు. ఎమ్మెల్యే వస్తే గానీ ప్రారంభించేది లేదని అధికారులు తెగేసి చెప్పడంతో చేసేది లేక పీలా తన అనుచరులతో గవరపాలెంలోని పార్టీ కార్యాలయానికి వెళ్లిపోయారు. ఆ వెంటనే జనసేన నాయకులు పీలా వెళ్లిపోయిన విషయాన్ని కొణతాలకు ఫోన్‌లో సమాచారం అందజేశారు. సుమారు ఉదయం 11.30 గంటలకు ఎమ్మెల్యే వచ్చి కోట్నివీధి రేషన్ డిపోను ప్రారంభించారు. పీలా వెళ్లిన తరువాత కొణతాల రావడంపై టీడీపీ శ్రేణులు రుసరుసలాడుతూ కనిపించారు. తమను అవమానించడానికే జనసేన నాయకులు ఇలా వ్యవహరిస్తున్నారని, బయటకు చెప్పుకోలేక లోలోపల మదనపడ్డారు. లబ్ధిదారులు కూడా 3 గంటలకు పైగా నిరీక్షించాల్సి రావడంతో నిరాశతో వెనుదిరిగారు.

మీకు దండాలు.. దయచేసి చదువును దూరం చేయొద్దు



టీచర్‌ను నియమించాలని దండం పెట్టి వేడుకుంటున్న గిరిజన బాలలు, సీపీఎం నాయకులు

కోటవురట్ల: విద్యా శాఖామంత్రి లోకేష్ గారూ.. మా పిల్లలకు చదువులు అవసరం లేదా..గిరిజన పిల్లలు చదువుకు దూరంకావలసిందేనా..ఓట్ల కోసం ఎన్నో హామీలు ఇచ్చారు.. మా పిల్లల కోసం ఓ ఉపాధ్యాయుడిని నియమించలేరా అంటూ అణుకు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తూ దండం పెడుతూ ఆందోళన చేశారు. అణుకు గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో గిరిజనులు ఆదివారం ఆందోళన చేశారు. ప్రత్యామ్నాయ పాఠశాలను తెరిచి ఉపాధ్యాయుడిని నియమించాలని నినాదాలు చేశారు. పార్టీ మండల కార్యదర్శి ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ ఈ గ్రామానికి గత ప్రభుత్వంలో రోడ్డు వేసి, ప్రత్యామ్నాయ పాఠశాలకు ఉపాధ్యాయుడిని కేటాయించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉపాధ్యాయుడిని తొలగించారని, దీంతో చిన్నారులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ సుమారు 60 మంది పిల్లలు ఉన్నారని, ప్రస్తుతం వర్షాలకు రోడ్డు కూడా శిథిలమైందని, పిల్లలు రాళ్లు తేలిన రోడ్డుపై చదువు కోసం 12 కిలోమీటర్లు రానుపోను నడవాల్సిన పరిస్థితి ఉందన్నారు. విద్యా శాఖా మంత్రి ,కలెక్టర్ స్పందించి గిరిజన బాలల కోసం పాఠశాలను పునఃప్రారంభించాలని కోరారు. సీపీఎం నాయకులు ఎం.నానాజీ, ఎం.సూరిబాబు, రఘుబాబు, నర్సింగరావు, నవీన్ పాల్గొన్నారు.

ప‘రేషన్’



నక్కపల్లి మండలం రాజయ్యపేటలో రేషన్ కోసం క్యూలో నిలుచున్న కార్డుదారులు

- ఎండీయూ వాహనాల రద్దుతో పేదలకు మళ్లీ పాట్లు
- సర్వర్ మొరాయింపుతో పడిగాపులు
- మెషీన్లు పనిచేయక వెనుతిరిగిన లబ్ధిదారులు
- మొక్కుబడిగా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభోత్సవం



సరుకులు నెత్తిమీద పెట్టుకుని వెళ్తున్న వృద్ధురాలు



లక్ష్మీదేవి పేటలో డిపోలో వేలిముద్రలు పడకపోవడంతో వృద్ధుల ఇక్కట్లు



అనకాపల్లి మండలం కోట్ని వీధిలో అతిథుల రాక ఆలస్యం కావడంతో ఉదయం 10.30 గంటలైనా తెరుచుకోని రేషన్ డిపో

సాక్షి, అనకాపల్లి: రేషన్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. లబ్ధిదారులకు చుక్కలు కనిపించాయి. దూర ప్రాంతాల్లో ఉన్న రేషన్ డిపోలకు వెళ్లి గంటల కొద్దీ క్యూ లైన్లలో పడిగాపులుకాశారు. వేలిముద్రలు పడలేదని, సర్వర్ మొరాయించిందని రేషన్ డీలర్లు చెప్పడంతో చేసేది లేక సాయంత్రం వరకు వేచి ఉండాల్సి వచ్చింది. రేషన్ సరుకుల కోసం పేదలు గంటల తరబడి క్యూల్లో నిరీక్షించకూడదని సదుద్దేశంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన ఇంటి వద్దకే రేషన్ ఎండీయూ విధానాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసింది. మళ్లీ పాత వ్యవస్థను తీసుకొచ్చి ప్రజల కష్టాలకు తెరతీసింది. దీంతో ఆరేళ్ల కిందట ఇబ్బందులే పునరావృతమయ్యాయి. జిల్లాలోని రేషన్ డిపోల్లో ఆదివారం నిత్యావసర సరుకుల పంపిణీ ప్రారంభించారు. సుమారు 200కు పైగా దుకాణాల్లో కార్డుదారులు ఇక్కట్లకు గురయ్యారు. పలు షాపుల్లో ఈ పాస్ యంత్రాలు మొరాయించాయి. దీంతో రేషన్ కార్డుదారులు మండుటెండలో రోడ్డు మీద పడిగాపులు కాయవలసి వచ్చింది. రేషన్ సరకులు కోసం డిపోల వద్ద గంటల తరబడి వృద్ధులు, దివ్యాంగులు బారులు తీరారు. ఇచ్చిన సరకులను ఎండలోనే మోసుకు వెళ్లాల్సి వచ్చింది. కూటమి నేతలు ఇదేదో కొత్తగాపెట్టిన పథకం మాదిరిగా హడావుడి చేశారు. రిబన్లు కట్ చేసి ప్రారంభోత్సవాలు చేశారు. నక్క పల్లి మండలంలో తొలిరోజు పది డిపోల్లో మెషీన్లు మొరాయించాయి. దీంతో మధ్యాహ్నం నుంచి సరుకుల పంపిణీ ప్రారంభించారు. అనకాపల్లి మండలం గొలగాంలో సర్వర్ పనిచేయకపోవడంతో గంటలతరబడి కార్డుదారులు వేచిఉన్నారు. అనకాపల్లి మండల పరిధిలోని పలుగ్రామాల్లో తూకంలో మోసాలు జరిగినట్టు పలువురు కార్డుదారులు వాపోయారు. చోడవరం నియోజకవర్గంలో 194 రేషన్ డిపోల్లోనూ మిషన్లు మొరాయించాయి. కె.కోటపాడు మండలంలో గొండుపాలెం, ఎ.కోడూరు, వారాడ, వి.సంతపాలెం గ్రామాల్లో సర్వర్ పని చేయలేదు. నాతవరం మండలం గుమ్మడిగొండలో సర్వర్ పనిచేయకపోవంతో క్యూలో మహిళలు గంటల తరబడి వేచి ఉండి, వెనుదిరిగారు.

రాష్ట్ర ప్రజలకు కూటమి సర్కార్ వెన్నుపోటు

- సూపర్ సిక్స్ హామీలు అమలులో ఘోర వైఫల్యం
- నారావారి మోసాలను నిరసిస్తూ 4న 'వెన్నుపోటు దినం'
- మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు
- తారువలో వెన్నుపోటు దినం కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరణ



తారువలో వెన్నుపోటు దినం పోస్టర్‌ను విడుదల చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: టీడీపీ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఎన్నికల హామీలను అమలు చేయకుండా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు బూడి ముత్యాలనాయుడు విమర్శించారు. తారువలో ఆదివారం మాడుగుల నియోజకవర్గ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మోసాలను ఎండగడుతూ 4న మాడుగులలో నిర్వహించే 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి 'వెన్నుపోటు దినం' కార్యక్రమం పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఎన్నికల హామీలు అమలు చేయాలని ప్రజలు తరఫున కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు తలపెట్టిన ఈ నిరసన కార్యక్రమానికి ప్రజలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. కూటమి ఏడాది పాలనలో రాష్ట్ర ప్రజలు సంక్షేమ, అభివృద్ధికి దూరమయ్యారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోను సంక్షేమ పథకాలన్నింటిని నిరాటంకంగా అమలుచేశామని తెలిపారు. జగన్ పాలనలో రాజకీయాలకు అతీతంగా సంక్షేమాన్ని అందించి ప్రతి ఇంటికి గర్వంగా వెళ్లగలిగామని చెప్పారు. కూటమి పాలనలో సూపర్ సిక్స్ సహా ఎన్నికల హామీలను అమలు చేయకపోవడంతో ప్రజల చెంతకు వెళ్లలేక పోతున్నారని ఎద్దేవా చేశారు. మాడుగుల నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కేటాయింపులో వివక్ష చూపుతున్నారని జిల్లా స్థాయి మినీ మహానాడులో స్వయంగా స్థానిక ఎమ్మెల్యే ఆవేదన వెళ్లగక్కడం కూటమి పాలన తీరుకు నిదర్శనమన్నారు. మహానాడులో ప్రజలకు ఏం చేశారో, ఏం చేస్తారో చెప్పకుండా వారి వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు మాజీ సీఎం జగన్‌పై విమర్శలకే పరిమితమయ్యారన్నారు. అన్నదాత సుఖీభవ కింద ఒక్కో రైతుకు రూ. 20 వేలు, తల్లికి వందనం పథకం కింద ఎంత మంది పిల్లలుంటే అందరికీ రూ. 15 వేలు ఇస్తామని చెప్పి రైతులను, మహిళలను మోసం చేశారని తెలిపారు. 18 ఏళ్ల నిండిన మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు 1500, పేదలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని చెప్పిన చంద్రబాబు కనీసం ఈ పథకాల ఊసెత్తక పోవడం దారుణమని చెప్పారు. యువతకు 20 లక్షల ఉద్యోగవకాశాలు కల్పిస్తామని, లేకుంటే నిరుద్యోగ భృతి కింద ఏడాదికి రూ. 3 వేలు ఇస్తామని చెప్పి దగా చేశారన్నారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని వాయిదాలు వేస్తున్నారని మండిపడ్డారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పిన కూటమి నేతలు చెరకు రైతులకు పేమెంట్లు ఇవ్వకుండా మనుగడ ప్రశ్నార్థకం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధికి ఐదేళ్లలో జగన్ సుమారు రూ. 90 కోట్లు మంజూరు చేయగా, కూటమి సర్కార్ ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని తెలిపారు. మైదాన, గిరిజన గ్రామాలకు తారు రోడ్లు నిర్మించిన ఘనత తమకే దక్కుతుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు, స్కూళ్లను నాడు-నేడులో అభివృద్ధి చేశామని చెప్పారు. రైవాడ ప్రాజెక్టును డ్రిప్ స్కీమ్‌లో చేర్పించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని, కూటమికి చిత్తశుద్ధి ఉంటే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలన్నారు. పెద్దేరు జలాశయం కెనాల్ ఆధునీకీకరణకు గత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి సుమారు రూ. 84 కోట్లు మంజూరు చేసి టెండర్ పూర్తి చేస్తే, కూటమి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. జల్‌జీవన్ మిషన్‌లో నియోజకవర్గానికి సుమారు రూ. 175 కోట్లు మంజూరు చేసి, ట్యాంక్‌లు నిర్మించి, పైపులైన్ పనులు సైతం దాదాపుగా పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, వైస్ ఎంపీపీ పంచాడ సింహాచలం నాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు వరదపురెడ్డి లలితానాయుడు, ఆర్టీఐ విభాగం జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ, మండల మహిళా అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు కిల్లాన శ్రీనివాసరావు, మండల రైతు విభాగం అధ్యక్షుడు అన్నం రామునాయుడు, సర్పంచ్‌లు నాగిరెడ్డి శరారినాయుడు, దాడి జగన్, దాసరి సంతోష్‌కుమార్, ఎంపీటీసీ పోతల వెంకటరావు, రుత్తల రాంబాబు, కాటిపాం పెదనాయుడు, భగత వెంకటరమణ, వేచలపు చిన్నంనాయుడు, రొంగలి నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్నకు వడ్డీతో సహా తిరిగిస్తాం

మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడికి భవిష్యత్తులో వడ్డీతో సహా తిరిగిస్తామని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ హెచ్చరించారు. హత్యాయత్నానికి గురై ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ యూత్ అధ్యక్షుడు అల్లంపల్లి ఈశ్వరరావును పార్టీ నాయకులతో కలిసి గణేష్ ఆదివారం పరామర్శించారు. ఈశ్వరరావు కుటుంబానికి ఆయన భరోసా ఇచ్చారు. డీఎస్పీ పి.శ్రీనివాసరావును కలిసి పార్టీ నాయకుడుపై దాడి చేసిన టీడీపీ కార్యకర్త, రౌడీ షీటర్ పప్పల అప్పలనాయుడిని,ఆయన అనుచరులను తక్షణమే అరెస్టు చేయాలని కోరారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ స్పీకర్ అయ్యన్న పాత్రుడు పెంచి పోషిస్తున్న కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు ఆధ్వర్యంలో ఈ దాడి జరిగిందని చెప్పారు. ఎల్లకాలం ఇదే ప్రభుత్వం ఉండదన్న విషయాన్ని ధనిమిరెడ్డి మధు గుర్తు పెట్టుకోవాలన్నారు. మధుతో పాటు రెచ్చిపోతున్న రౌడీ షీటర్, కొంత మంది టీడీపీ నాయకులను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. స్పీకర్ అండ చూసుకుని వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు చేస్తే భవిష్యత్తులో వదిలే ప్రసక్తిలేదన్నారు. అయ్యన్నపాత్రుడు అనుచరుడు, రౌడీ షీటరు పప్పల అప్పలనాయుడుకు పలు హత్యలు, తగదాల్లో ప్రమేయం ఉందన్నారు. ఆరు నెలల క్రితం వైఎస్సార్‌సీపీ నాయకుడు, బీసీ కార్పొరేషన్ స్టేట్ మాజీ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావుపై ఇదే రౌడీ షీటర్ కత్తితో దాడి చేస్తే తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేస్తే, స్టేషన్ బెయిల్ ఇచ్చి వదిలిపెట్టడం మరీ దారుణమన్నారు. రౌడీ షీటర్ అప్పలనాయుడు, అతని అనుచరులు మా పార్టీ నాయకుడు ఈశ్వరరావును హతమార్చేందుకు దాడికి తెగబడ్డారని చెప్పారు. శ్రీనివాసరావుపై దాడి జరిగినప్పుడే పోలీసులు చర్యలు తీసుకుని ఉండి ఉంటే ఈ దాడి జరిగేది కాదని తెలిపారు. హత్యాయత్నానికి పాల్పడిన రౌడీ షీటర్, మరో పది మందిని తక్షణమే అరెస్ట్ చేయాలని, లేనిపక్షంలో ఉద్యమిస్తామని తెలిపారు. గణేష్ వెంట పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల సన్యాసిపాత్రుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, కౌన్సిలర్ సిరసపల్లి నాని, కోఆప్షన్ సభ్యులు, ఎండీ. భాషా, షేక్ రోజా, లగుడు స్వామి, ముస్లిం కార్పొరేషన్ స్టేట్ మాజీ డైరెక్టర్ షేక్ ఉన్నీషా బేగం, పార్టీ నాయకులు గంటా లలిత, లోకవరపు శారద, పార్టీ యూత్ నాయకులు ఉన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

నర్సీపట్నం: పట్టణంలోని పెదబొడ్డేపల్లి జంక్షన్‌లో ఆదివారం నిర్వహించిన వాహన తనిఖీల్లో 8 కిలోల గంజాయిని పట్టుకున్నామని టౌన్ సీఐ గోవిందరావు తెలిపారు. చోడవరం రోడ్డు నుంచి ఇద్దరు వ్యక్తులు లగేజీ బ్యాగులతో నడుచుకొని వస్తుండగా, వారిని ఆపి తనిఖీ చేయగా గంజాయి పట్టుబడిందన్నారు. తమిళనాడు రాష్ట్ర కోయంబత్తూరుకు చెందిన హరీష్, కన్నన్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

దళిత యువకుడిపై హత్యాయత్నం గర్హనీయం

వివిధ ప్రజా సంఘాల నాయకులు ఆందోళన



అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నర్సీపట్నం: దళిత యువకుడు అల్లంపల్లి ఈశ్వరరావుపై హత్యాయత్నాన్ని నిరసిస్తూ బహుజన ఐక్య వేదిక, వివిధ ప్రజా సంఘాల నాయకులు స్థానిక అబిడ్ సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బాధితుడు భార్య లక్ష్మి మాట్లాడుతూ పోలీసులు కేసును నీరుగార్చేందుకు చూస్తున్నారని ఆరోపించింది. తన భర్తకు ఏమైనా అయితే కుటుంబ పరిస్థితి ఏమిటని ప్రశ్నించింది. పక్కాగా తన భర్తను హత్య చేసేందుకు కత్తులు, రాడ్లుతో వస్తే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో సరిపెట్టడం సరికాదన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. బహుజన ఐక్యవేదిక కన్వీనర్ బొట్టా నాగరాజు మాట్లాడుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇలాకాలో ప్రజల ప్రాణాలకు రక్షణ లేదని వాపోయారు. నిందితులపై తక్షణమే హత్యాయత్నం కేసు నమోదు చేయాలన్నారు. వైజాగ్ భీమసేన కన్వీనర్ రవి సిద్ధార్థ మాట్లాడుతూ మొన్న హోంమంత్రి అనిత నియోజకవర్గంలో దళితులపై దాడి జరిగిందన్నారు. ఈ రోజు సాక్షాత్తు స్పీకర్ నియోజకవర్గంలో దళిత సామాజిక వర్గానికి చెందిన నాయకుడిపై హత్యాయత్నం జరగడం శోచనీయమన్నారు. ఈ దాడులు, హత్యాయత్నాలు, హత్యలు కేవలం దళితులపై జరుగుతున్నాయన్నారు. అంబేడ్కర్ ఇండియన్ మిషన్ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు సరమండ వీరబాబు మాట్లాడుతూ దళితులు రాజకీయాలు చేస్తుంటే చంపేయాలని చూడడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఆరుగుల్ల రాజుబాబు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా దళిత యువకుడు ఈశ్వరరావుపై దాడి జరగటం అమానుషం అన్నారు. స్వేరో నెట్‌వర్క్ రాష్ట్ర కన్వీనర్ చిట్టయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి హత్యా రాజకీయాలు ఎంతమాత్రం సమంజసం కాదన్నారు. లోతుగా విచారణ చేసిన బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. తొలుత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ ఆందోళనలో సాల్మన్‌రాజు, దేముడు, నాగేశ్వరరావు, సూరిబాబు, అప్పలనాయుడు, జల్లు బాబు తదితరులు పాల్గొన్నారు.

కాఫీ రైతులతోనూ చెలగాటం

అంతర్జాతీయ మార్కెట్‌లో మన్యం కాఫీకి మంచి డిమాండ్ ఉన్నా గిరిజన రైతులకు జీసీసీ గిట్టుబాటు ధర కల్పించలేకపోయింది. ఈ విషయంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ప్రైవేట్ వ్యాపారులకు ధీటుగా నిలవలేకపోయింది. దీంతో ఈ సంస్థకు విక్రయించిన రైతుల ఆర్థికపరిస్థితి దయనీయంగా మారింది.



కాఫీ గింజలను కొనుగోలు చేస్తున్న జీసీసీ సిబ్బంది (ఫైల్)

- గిట్టుబాటు ధర కల్పించలేని గిరిజన సహకార సంస్థ
- ప్రైవేట్‌తో పోటీపడలేక లక్ష్యసాధనలో వెనుకబాటు
- రెండు వేలకు 752 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు
- పాచ్‌మెంట్‌కు జీసీసీ ధర రూ.400
- వ్యాపారుల ధర రూ.500
- ఆర్థికంగా నష్టపోయిన గిరి రైతులు



పాచ్‌మెంట్ కాఫీ గింజలు

సాక్షి,పాడేరు: ఈ ఏడాది మన్యం కాఫీకి అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ధరలు కూడా లాభదాయకంగా ఉన్నాయి. అయితే అందుకు తగ్గట్టుగా గిట్టుబాటు ధరతో మన్యంలో కాఫీ గింజలను కొనుగోలు చేయాల్సిన జీసీసీ కూడా ప్రైవేట్ సంస్థలాగే వ్యవహరించింది. ప్రైవేట్ వ్యాపారులతో జీసీసీ పోటీ పడలేక పోయింది. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సంతల్లో ప్రైవేట్ వ్యాపారులంతా పాచ్‌మెంట్ కాఫీ గింజలను కిలో రూ.500కు మించి కొనుగోలు చేశారు. జీసీసీ మాత్రం కిలో రూ.400 ధర మాత్రమే చెల్లించింది. దీంతో గిరిజన రైతులంతా ప్రైవేట్ వ్యాపారులకే అమ్ముకున్నారు.

సిబ్బంది రంగంలోకి దిగినా..

ఏజెన్సీలో 1.56 లక్షల ఎకరాల్లో కాఫీతోటలు ఉన్నాయి. ఏటా 15వేల మెట్రిక్ టన్నుల కాఫీ గింజలను గిరిజన రైతులు మార్కెటింగ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గిరిజన సహకార సంస్థ ఈ ఏడాది రెండు వేల మెట్రిక్ టన్నుల పాచ్‌మెంట్ కాఫీ గింజల సేకరణ లక్ష్యంతో గత ఏడాది డిసెంబర్‌లో కొనుగోలు ప్రారంభించింది. జీసీసీ సిబ్బంది అంతా గిరిజన గ్రామాల్లో ఇంటింటా తిరిగినప్పటికీ కొనుగోలుకు సంబంధించి అనుకున్న లక్ష్యాలను సాధించలేక పోయింది. రెండు వేల టన్నుల లక్ష్యంలో 752 మెట్రిక్ టన్నుల కాఫీ గింజలను మాత్రమే కొనుగోలు చేసింది. వీటిలో పాచ్‌మెంట్ గింజలు 132 కిలోలకు పరిమితమైంది. మిగిలిన 620 కిలోలు చెర్రీ రకాన్ని కిలో రూ.330తో జీసీసీ కొనుగోలు చేసింది. ఇదే చెర్రీ రకం గుల్ల కాఫీ గింజలను ప్రైవేట్ వ్యాపారులు కిలోకు రూ.400కు పైగా చెల్లించి కొనుగోలు చేశారు.

వ్యాపారంలో వెనుకబాటు

గత నెలలో కాఫీ గింజల సీజన్ ముగిసినప్పటికీ జీసీసీ మాత్రం కాఫీ వ్యాపారంలో బాగా వెనుకబడింది. జీసీసీ తక్కువ ధర చెల్లించడంతో కాఫీ రైతులు సీజన్ చివరిలో ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించి మంచి ఆదాయం పొందారు. ఈ సంస్థకు సీజన్ ప్రారంభంలో అమ్ముకున్న రైతులు ఆదాయ పరంగా నష్టపోయారు. జీసీసీ కూడా దళారి వ్యవస్థ మాదిరిగానే తమ పట్ల వ్యవహరించిందని గిరిజన రైతుల నుంచి విమర్శలు ఎదుర్కొంది. బెంగళూరు మార్కెట్‌లో పాచ్‌మెంట్ కాఫీ గింజలు కిలో రూ.550 ధరకు అమ్మకాలు జరిగినప్పటికీ జీసీసీ మాత్రం కాఫీ గింజల కొనుగోలు ధరను పెంచకపోవడం వల్ల గిరిజన రైతులు ప్రైవేట్ వైపే మొగ్గు చూపారు.

ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకున్నా



జీసీసీ కాఫీ కొనుగోలుకు తక్కువ ధర చెల్లించడం వల్ల కాఫీ రైతులు ప్రైవేట్ సంస్థలు, వ్యాపారులకు అమ్ముకున్నారు. గతంలో జీసీసీకు అమ్మిన రైతులు కూడా ఈ ఏడాది జీసీసీని నమ్మలేదు. పాచ్‌మెంట్, చెర్రీ గుల్ల కాఫీ గింజలకు మార్కెట్‌లో అధిక ధరలు పలకగా, జీసీసీ మాత్రం తక్కువ ధరకు కొనుగోలు చేయడం వల్ల ప్రైవేట్ వ్యాపారులకే అమ్ముకుని మంచి ఆదాయం పొందా. - **పాలికి లక్కు,** కాఫీ రైతులు సంక్షేమ సంఘ ప్రతినిధి, గుర్రగరువు, పాడేరు మండలం



చెర్రీ గుల్ల రకం కాఫీ గింజలు

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

ఇద్దరికి తీవ్ర గాయాలు



108 వాహనంలో క్షతగాత్రులను తరలిస్తున్న కుటుంబీకులు

దేవరాపల్లి: ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు బలంగా ఢీ కొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం దేవరాపల్లి నుంచి జీనబాడు వెళ్లే రహదారిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కివర్ల గ్రామానికి చెందిన కేత దేముడు దేవరాపల్లి నుంచి తన గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అదే సమయంలో పెదబయలు నుంచి దేవరాపల్లి వైపు వస్తున్న ఎస్. ప్రసాద్ ద్విచక్ర వాహనం పరస్పరం ఢీకొన్నాయి. ఇద్దరు తలలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే స్పందించి దేవరాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్య సేవలు నిమిత్తం కె.కోటపాడు సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.

పోటెత్తిన భక్తజనం



పాదాలు గుడి వద్ద బారులు తీరిన భక్తులు

సాక్షి,పాడేరు: మన్యం ప్రజల ఆరాధ్యదేవత పాడేరు ఘాట్‌లోని మోదకొండమ్మతల్లి పాదాలు గుడికి భక్తులు ఆదివారం పోటెత్తారు. మైదాన ప్రాంత భక్తులతో పాటు గిరిజన కుటుంబాలు మోదకొండమ్మ ఇంటి పండగలకు భారీగా తరలివచ్చారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు భక్తులు మోదకొండమ్మతల్లికి ఘటాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. గంటల తరబడి భక్తులు క్యూలైన్‌లో నిల్చుని మోదకొండమ్మతల్లి పాదాలు, ఉత్సవ విగ్రహాలను దర్శించుకున్నారు. ఘాట్‌లోని కాఫీ తోటలు, ప్రధాన జంక్షన్ల వద్ద వంటలు చేసుకుని సామూహిక భోజనాలు నిర్వహించారు.



కాఫీతోటల్లో వంటలు చేసుకుంటున్న భక్తులు

రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి



పవన్‌కుమార్(ఫైల్)

ఎస్.రాయవరం : వమ్మవరం గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్‌ఐ విభీషణరావు ఆదివారం అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.వమ్మవరం నుంచి పెనుగొల్లుకు బైక్‌పై ఇద్దరు యువకులు వస్తుండగా వీరిని వమ్మవరం గెడ్డపాలెం రోడ్డుపై నుంచి వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న కొరుప్రోలు పవన్‌కుమార్(22)కు తీవ్రగాయాలు కాగా, భాస్కరరావుకి స్వల్పగాయాలయ్యాయి.ఇద్దరినీ హుటాహుటిన నక్కపల్లి ఆస్పత్రికి తరలిచారు. ఆస్పత్రికి తరలించేసరికి పవన్‌కుమార్ మృతిచెందినట్టు ఎస్‌ఐ చెప్పారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

అప్పుల పాలైన రైతు ఆత్మహత్య



రైతు సూరిబాబు(ఫైల్)

మునగపాక: మండలంలోని కుమారపురంలో అప్పులు తీర్చలేక క్రిమిసంహారక మందు తాగి రైతు ఆత్మహత్యకు యత్నించాడు. ఆదివారం విశాఖ కేజీహెచ్‌లో అతడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుమారపురం గ్రామానికి చెందిన పల్లెల సూరిబాబు(60) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయ పెట్టుబడులకు గాను రూ.5 లక్షలు, తన చిన్న కుమారుడు శ్రీనివాస్ కోసం దస్తావేజులు తనఖా పెట్టి ప్రైవేటు వ్యక్తుల నుంచి మరో రూ.5 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. వీటిని తీర్చే మార్గం లేక నిత్యం మద్యానికి బానిసై వడ్డీ చెల్లించే పరిస్థితులు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. దీనిలో భాగంగా గత నెల 28న సాయంత్రం క్రిమిసంహారక మందు తాగినట్లు గుర్తించిన కుటుంబ సభ్యులు అతడిని అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు కుమారుడు నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు.

ఇద్దరు విద్యార్థుల దుర్మరణం

- కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న బైక్
- సరిపల్లి దాటిన తరువాత సర్వీస్ రోడ్డులో ప్రమాదం



ప్రమాదంలో మరణించిన మద్దాల శ్రీరామ్, శరగడం దాని సత్య అవినాష్

పెందుర్తి: బైక్‌పై సరదాగా షికారుకు వెళ్లిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. బైక్‌పై వేగంగా వెళుతున్న సమయంలో కుక్క అడ్డు రావడంతో నియంత్రణ కోల్పోయి వాహనం అదుపుతప్పడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆదివారం సాయంత్రం పెందుర్తి పట్టణంలో తీవ్ర విషాదాన్ని నింపిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పెందుర్తి రాచ్చెరువు సమీపంలోని ఆదిత్యనగర్‌కు చెందిన శరగడం శ్రీనివాసరావు కుమారుడు శరగడం దాని సత్య అవినాష్(20), పెందుర్తి కూడలి వద్ద నివాసం ఉంటున్న మద్దాల సుధారాణి కుమారుడు మద్దాల శ్రీరామ్(17) స్నేహితులు. అవినాష్ నగరంలోని ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా.. శ్రీరామ్ ఇటీవలే ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత సాధించాడు. ఇద్దరు కలిసి ఆదివారం సాయంత్రం ట్రయంప్ బైక్‌పై ఆనందపురం-అనకాపల్లి జాతీయ రహదారి మీదుగా శొంఠ్యాం వైపు వెళుతున్నారు. సరిగ్గా సరిపల్లి దాటిన తరువాత సర్వీస్ రోడ్డులో కుక్క అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఇరువురు తలలకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పెందుర్తి సీఐ కె.వి. సతీష్‌కుమార్, ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు సిబ్బందితో అక్కడికి వెళ్లి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతులేని విషాదం

ప్రమాదంలో మృతి చెందిన మద్దాల శ్రీరామ్ తండ్రి సతీష్ కోవిడ్ సమయంలో మరణించాడు. దీంతో సుధారాణి పెందుర్తిలో ఓ కిరాణా దుకాణం నడుపుతూ పిల్లలను చదివిస్తున్నారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న శ్రీరామ్ ఎంసెట్ రాశాడు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు శ్రీరామ్‌ను బలిగొంది. కాగా శరగడం శ్రీనివాసరావు, అరుణ దంపతులకు అవినాష్‌తో పాటు ఓ కుమార్తె ఉంది. బీటెక్ చదువుతున్న అవినాష్ చదువులో చురుగ్గా ఉంటాడు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కుమారులు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. వారిని ఓదార్చడం ఎవరితరం కాలేదు.



పెందుర్తి వద్ద హైవేపై ప్రమాదం దృశ్యం

బాలిక ఆత్మహత్య

తాటిచెట్లపాలెం: ఫోర్ట్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి శ్రీనివాసనగర్‌లో ఆదివారం బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. ఇత్తు నాగరాజు కుటుంబంతో శ్రీనివాసనగర్, దాడి రామ్మూర్తి కల్యాణమండపం సమీపంలో అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. నాగరాజు కారు డ్రైవర్ కాగా, భార్య హౌస్ కీపింగ్ పనులు చేస్తోంది. వీరి కుమారుడు మణికంఠ(15) 10వ తరగతి, కుమార్తె హేమిని(13) 8వ తరగతి చదువుతున్నారు. నాగరాజు విధులకు, భార్య ఫంక్షన్ నిమిత్తం పద్మనాభం వెళ్లారు. మణికంఠ సాయంత్రం 4.30 గంటలకు స్నేహితుడి దగ్గరికి వెళ్లాడు. 6.15 గంటలకు తండ్రి ఇంటికి వచ్చి చూసేసరికి హేమిని హాల్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకుంది.

విద్యుదాఘాతంతో బాలిక మృతి

తగరపువలస: ఆనందపురం మండలం పందలపాక పంచాయతీ యాతపేటలో శనివారం రాత్రి గండిబోయిన సాయి మేఘన(12) అనే 6వ తరగతి విద్యార్థిని విద్యుదాఘాతంలో మృతి చెందింది. ఆమె తండ్రి ఈ మేరకు ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంట్లో మోటారు స్విచ్ ఆన్ చేసిన మేఘన అప్పటికే వర్షం కారణంగా తడిచి ఉండటంతో విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయింది. వెంటనే అంబులెన్స్‌లో భీమిలిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్టు ధృవీకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద మృతి కాదు హత్యే

నిందితుడి అరెస్ట్

డాబాగార్డెన్స్: వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దారుణమైన సంఘటన చోటు చేసుకుంది. ఓ వ్యక్తి భవనం నుంచి పడి మృతి చెందగా, పోలీసులు విచారణలో అది హత్యగా తేలింది. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వన్‌టౌన్ సీఐ జీడీ బాబు ఆదివారం తెలిపిన వివరాలివి. గత నెల 29న జీవీఎంసీ 36వ వార్డు పరిధిలోని జీవీఎంసీ భవనంపై లోతేటి హేమంత్‌కుమార్, పవన్ సాయి ఏదో విషయమై మాట్లాడుకున్నారు. మద్యం సేవించిన హేమంత్‌కుమార్.. జీవీఎంసీ భవనానికి ఎదురుగా ఉన్న ధోనీ సతీష్ ఇంటి పైకి వెళ్లాడు. గతంలో వారి మధ్య తగాదా జరిగింది. మనస్పర్థల కారణంగా హేమంత్‌కుమార్ తన ఇంట్లో సామాన్లు దొంగతనం చేస్తున్నాడని సతీష్‌ను నిలదీశాడు. ఈ క్రమంలో వాగ్వాదం తీవ్రం కావడంతో.. ఆగ్రహించిన సతీష్ హేమంత్‌కుమార్‌ను చెంపపై కొట్టి, భవనంపై నుంచి తోసివేశాడు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన హేమంత్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు తండ్రి చిట్టిరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మొదట అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినప్పటికీ, విచారణలో ఇది హత్య అని తేలడంతో పోలీసులు కేసు సెక్షన్లు మార్చారు. నిందితుడైన ధోనీ సతీష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ జీడీ బాబు తెలిపారు.

మొదలైన రేషన్ కష్టాలు

- నంచులతో డిపోల వద్ద క్యూ కట్టిన కార్డుదారులు
- కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లిన వైనం
- సర్వర్ పనిచేయక గంటల కొద్దీ నిరీక్షణ
- డబ్బాలతో చేతివాటం మొదలెట్టిన డీలర్లు

సీఎం చంద్రబాబు నిర్ణయంతో బియ్యం కార్డుదారులకు మళ్లీ పాత కష్టాలు మొదలయ్యాయి. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ దుకాణాలను పునరుద్ధరించడంతో కోటా బియ్యం పొందడం కోసం అష్టకష్టాలు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతి నెలా ఇంటి వద్దకు వచ్చిన ఎండీయూ వాహనం వద్ద హాయిగా రేషన్ తీసుకునేవారు. ఇప్పుడు పనులు మానుకుని తెల్లవారే కిలోమీటర్ల దూరంలో ఉన్న రేషన్ డిపోలకు పరుగులు తీస్తున్నారు. తొలిరోజు సర్వర్ పని చేయక వేలిముద్రలు సరిగా పడక గంటల కొద్దీ నిరీక్షించారు. మరికొన్ని చోట్ల డిపోలు లేక ఎక్కడ రేషన్ తీసుకోవాలో తెలియక అయోమయానికి గురయ్యారు.


కశింకోటలో సర్వర్ సక్రమంగా పని చేయక వేలిముద్ర పడక నిరీక్షణ


డిపో వద్ద రేషన్ కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

కశింకోట/తుమ్మపాల: ఎండీయూ విధానం ద్వారా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బియ్యం, రేషన్ సరుకులను పంపిణీ చేసేవారు. ఇంటి సమీపంలోకి వెళ్లి వాహనం ద్వారా రేషన్ సరుకులు అందించేవారు. ఇది ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉండేది. తాజాగా కూటమి ప్రభుత్వం ఎండీయూ ద్వారా కోటా బియ్యం పంపిణీ విధానాన్ని రద్దు చేసి రేషన్ డిపోల పునరుద్ధరించింది. వీటి పంపిణీ తొలి రోజునే ప్రజలు కష్టాలను ఎదుర్కొన్నారు. సర్వర్ సక్రమంగా పని చేయక వేలిముద్రలు పడక ఎక్కువ సమయం నిరీక్షించాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నారు. గతంలో ఎండీయూ విధానంలో ఇంత సమయం నిరీక్షించాల్సి ఉండేది కాదని వాపోయారు.

రెండు సచివాలయాల పరిధిలో రేషన్ డిపోలే లేవు

కశింకోట మండలంలో 42 రేషన్ డిపోలున్నాయి. సుమారు 30 వేల బియ్యం కార్డులున్నాయి. వీరికి మండలంలో 20 వాహనాల ద్వారా గతంలో సరుకులందేవి. ప్రస్తుతం కశింకోటలో నాలుగు గ్రామ సచివాలయాలకుగాను 9 రేషన్ డిపోలు ఏర్పాటు చేశారు. వాటిలో 1, 4 గ్రామ సచివాలయాల పరిధిలో డిపోలు లేవు. అన్నీ 2, 3 గ్రామ సచివాలయాల పరిధిలోనే కేంద్రీకృతమై ఉన్నాయి. కశింకోట గవరపేటలో ఒకటి, పెద బజారు, కోమటి వీధి, పంచాయతీ కార్యాలయం, బాలికల ప్రాథమిక పాఠశాల, అమరపల్లి వీధి, పూసర్ల వీధి, ఉప్పునీటి దిబ్బ, కస్పావీధి ప్రాంతాల్లో మాత్రమే డిపోలున్నాయి. జాతీయ రహదారి అవతల అగ్రహారం, సత్తెమ్మ కాలనీ, అఫీషియల్ కాలనీ, ఇందిరా కాలనీ, తదితర ప్రాంతాలకు చెందిన 1వ సచివాలయ పరిధి ప్రజలకు తమ ప్రాంతంలో ఒక రేషన్ డిపో కూడా లేదు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రమాదకరమైన జాతీయ రహదారిని దాటి ప్రధాన గ్రామంలో ఉన్న రేషన్ డిపోలకు వచ్చి కోటా బియ్యాన్ని తీసుకోవలసిన పరిస్థితిని ఎదుర్కొన్నారు. 4వ సచివాలయ పరిధిలోని హౌసింగ్ కాలనీ ప్రాంతం నుంచి దూరంగా ఉన్న డిపోలకు నడిచి వెళ్లి బియ్యం తీసుకోవలసిన స్థితి తప్పలేదు. ప్రధానంగా మహిళలే ఎక్కువగా ఇటువంటి పరిస్థితిని ఎదుర్కొన్నారు. వారే ఎక్కువగా రేషన్ సరుకుల కోసం వచ్చారు.

కార్డుదారుల కేటాయింపులో అస్తవ్యస్తం..

ఇక రేషన్ డిపోలకు కార్డుదారులను కేటాయించడంలో అస్తవ్యస్తంగా వ్యవహరించి స్పష్టత లేకపోవడంతో కష్టాలు తప్పడం లేదు. గవరపేటకు చెందిన అనేక మంది కార్డుదారులను దూరంగా ఉన్న ఉప్పునీటి దిబ్బ, ఇతర ప్రాంతాల డిపోల్లోను, అక్కడి వారి కార్డులు గవరపేట ప్రాంతంలోను కలిపి గజిబిజీ చేయడం వల్ల ఎక్కడ రేషన్ సరుకులు పొందాల్లో తెలియక సతమతమవుతున్నారు. అంతేకాక తమకు కేటాయించిన డిపోలకు వెళ్లాలంటే దూరంగా నడిచి వెళ్లాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆన్‌లైన్ కావడం వల్ల తమకు అనుకూలమైన ఏ డిపోలోనైనా రేషన్ సరుకులు పొందవచ్చునని అధికారులంటున్నారు. మండలంలో తాళ్లపాలెంలో మూడు, మిగిలిన గ్రామాల్లో దాదాపుగా ఒక్కొక్క డిపో మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు దూరంగా ఒకే చోట ఉన్న డిపోకు వెళ్లి నిరీక్షించి తెచ్చుకోవలసిన పరిస్థితి ఏర్పడుతోందని వాపోతున్నారు. త్రిపురవానిపాలెం, అచ్యుతాపురం, తదితర శివారు గ్రామాల ప్రజలు ప్రధాన గ్రామంలో డిపోకు వెళ్లి రేషన్ తీసుకోవలసిన పరిస్థితిని ఎదుర్కొన్నారు. దీనిదృష్ట్యా ఎండీయూ విధానం కొనసాగిస్తే బాగుండంటున్నారు. ఏది ఏమైనా ఇళ్ల వద్దకు చేరువలోకి అందించే పీడీఎస్ వాహన విధానం సౌకర్యవంతంగా ఉందని, దీన్ని కొనసాగించాలని ఎక్కువగా కోరుతున్నారు.


రేషన్ డిపోలో కోటా బియ్యం పంపిణీ

అనకాపల్లి మండలంలో గంటల పాటు నిరీక్షణ

అనకాపల్లి మండలంలో ఆదివారం మొదలైన రేషన్ సరుకులు పంపిణీ కార్యక్రమంలో డిపోల వద్ద సరుకుల కోసం వచ్చిన లబ్ధిదారులు గంటల పాటు వేచి ఉండాల్సి వచ్చింది. సర్వర్ సమస్య ఉత్పన్నమవడంతో గంటకో కార్డు చొప్పున సరుకులు ఇచ్చారు. బియ్యం కోసం వచ్చిన మహిళలు మండుటెండల్లోనే వేచియున్నారు. దుకాణాల వద్ద ఎటువంటి సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు. కనీసం మంచినీళ్లు లేకుండా దుకాణాల వద్ద జనం పడిగాపులు కాశారు. అన్ని డిపోల్లోను మొదటి రోజే వృద్ధులు, దివ్యాంగులు క్యూ కట్టారు. వారికి ఇంటింటి సరుకుల పంపిణీపై ఎటువంటి సమాచారం ఇవ్వలేదని వాపోతున్నారు.


రేషన్ దుకాణంలో సిద్ధమైన ఇనుప డబ్బాలు


గవరపేటలోని రేషన్ డిపోలో రేషన్ కోసం నిరీక్షణ

ఇనుప డబ్బాలతో బియ్యం తూకం

20 కేజీల బియ్యం పంపిణీలో కేజీ బరువు ఉండే విధంగా ఇనుప డబ్బాలు అన్ని డిపోల వద్ద సిద్ధం చేశారు. సరుకుల ఆ డబ్బాల్లోనే వేసి లబ్ధిదారులకు వేశారు. 10 కేజీల బియ్యానికి 1/2 కేజీ, 5 కేజీలకు బియ్యానికి 300 గ్రాముల ఇనుప డబ్బాలతో సరుకులు కలిపి కాటా వేసి సరుకులు పంపిణీ చేశారు.

తూకంలో తేడా..

ఎండీయూ విధానంలో లబ్ధిదారులు వెంట తెచ్చుకున్న ప్లాస్టిక్ సంచుల్లోనే సరుకులు పోసి కాటా వేసేవారు. దాంతో తూకంలో ఎటువంటి తేడాలు వచ్చేవి కావు. కూటమి పాలనలో మొదటి రోజు రేషన్ దుకాణాల వద్ద పెద్ద ఇనుప డబ్బాలతో తూకాలు వేశారు. కాటా యంత్రాల్లో తేడాలతో పాటు ఇనుప డబ్బాల్లో సరుకులు వేసి మొత్తం లెక్కకడుతూ డీలర్లు అవినీతికి పాల్పడటంతో లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


రేషన్ డిపోలో పంపిణీకి సిద్ధంగా ఉన్న బియ్యం

వేలిముద్రలు పడక



సర్వర్ సరిగ్గా పని చేయక వేలిముద్రలు పడక ఎక్కువ సమయం కోటా బియ్యం కోసం నిరీక్షించాల్సి వచ్చింది. సర్వర్లు సక్రమంగా పని చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వేగి పూర్ణమ్మ, గవరపేట, కశింకోట

రేషన్ కోసం చాలా దూరం నడిచి వెళ్లాలి



వైఎస్సార్‌సీపీ హయాంలో మా కాలనీ వద్దకు చేరువలో వాహనం వచ్చి బియ్యాన్ని అందించేవారు. ఇప్పుడు మా ప్రాంతంలో డిపో లేకపోవడం వల్ల ఎక్కువ దూరం నడిచి వెళ్లి సంత బయల డిపోలో బియ్యం తీసుకోవల్సిన పరిస్థితి ఏర్పడింది. పైగా వేలిముద్రలు సక్రమంగా పడక ఎక్కువ సమయం నిరీక్షించాల్సి వచ్చింది. దీని దృష్ట్యా పాత విధానంలో సరుకులు అందించాలి.

– మోకరపు సింహాచలం, హౌసింగ్ కాలనీ, కశింకోట

1.5 కిలోమీటర్లు నడవాలి...



ఇంటికాడకొచ్చే రేషన్ బండిని తీసేసి మళ్లీ పాత కష్టాలను చంద్రబాబు తీసుకొచ్చారు. వృద్ధాప్యంతో నడవలేని మా లాంటి వాళ్ల గురించి కనీసం ఆలోచించకుండా రేషన్ దుకాణాల చుట్టు తిప్పించుకుంటున్నారు. ఐదు కేజీల బియ్యం కోసం 1.5 కిలోమీటర్లు నడవాలి. సర్వర్ పని చేయడం లేదంటూ గంటపాటు ఉంచారు.

– పదమట వెంకటలక్ష్మి, కోమట్ల కాలనీ గొలగాం పంచాయతీ, అనకాపల్లి మండలం

క్లుప్తంగా

సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు


పూల అలంకరణలో సూర్యనారాయణస్వామి

అనకాపల్లి: స్థానిక సుంకరమెట్ట జంక్షన్ వద్ద సత్యనారాయణ, సూర్యనారాయణ స్వామి దేవాలయానికి ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఇక్కడ సూర్యనారాయణ స్వామివారిని వివిధ రకాల పూలతో అలంకరించారు. పట్టణ, మండలంలో పలు ప్రాంతాల భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కొంతమంది వేకువజాము నుంచి సూర్య నమస్కారాలు చేశారు. దేవస్థానం మాజీ డైరెక్టర్ మారిశెట్టి శ్రీనివాసరావు, అర్చకులు పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, పార్లమెంట్ పరిశీలకురాలు శోభ హైమావతి, మాజీ ఎంపీ బీవీ సత్యవతి, రాష్ట్ర ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ మాజీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ విచ్చేయుచున్నట్లు పేర్కొన్నారు. కార్పొరేటర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

అగ్ని ప్రమాదంలో రూ.లక్ష ఆస్తి నష్టం


మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

అనకాపల్లి: స్థానిక రావుగోపాలరావు కళాక్షేత్రం రోడ్డులో పాత ఇనుప సామగ్రి దుకాణంలో ఆదివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంభవించింది. గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్ పీక కాల్చిపారేయడంతో ప్రమాదం జరిగి ఉంటుందని అగ్నిమాపక శాఖ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. రూ.లక్ష ఆస్తినష్టం జరిగినట్లుగా నివేదిక ఇచ్చారు. ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన దుకాణ యజమాని టేకు సత్తిబాబు బోరున విలపించాడు.

చదరంగంపై శిక్షణ


చదరంగం ఆటపై అవగాహన కలిగిస్తున్న ఉపాధ్యాయుడు మళ్ల కోటేశ్వరరావు

కశింకోట: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు చదరంగంపై శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయుడు మళ్ల కోటేశ్వరరావు ఈ సందర్భంగా చదరంగం ఆటలో మెలకువలు, ఆటాడే తీరును వివరించారు. గ్రంథాలయ అధికారి వరలక్ష్మి, విశ్రాంత ఉపాధ్యాయుడు వై. రామచంద్రరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో జనరల్ నాలెడ్జ్ గురించి గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం వివరించారు. జనరల్ నాలెడ్జ్ చదవడం, నేర్చుకోవడం వల్ల పోటీ పరీక్షలకు ఉపయోగపడనున్నట్లు తెలిపారు.

అనకాపల్లి సినిమాలు

భైరవం	:రాజా
ఖలేజా	:సత్యనారాయణస్క్రీన్-1
కరాటే కిడ్-లిజెండ్స్	: సత్యనారాయణ స్క్రీన్-2
ఖలేజా	:పర్తిసాయి
సింగిల్	:షిర్డీసాయి
ఏసీఈ	:వెంకటేశ్వర
శుభం	:శ్రీసత్య
షష్టిపూర్తి	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 44 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 10 యూనిట్లు, బీ పాజిటివ్ -5, ఓ పాజిటివ్ -23, ఏబీ పాజిటివ్ -6 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్‌ను 9703619706 ఫోన్లో సంప్రదించాలని కోరారు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 253 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 205 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ హామీ ఏమైంది?


నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కుమార్‌రాజాలను శాలువాలతో సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్.

అనకాపల్లి: 50 ఏళ్ల నిండిన బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రూ.4 వేల పింఛన్ ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన సీఎం చంద్రబాబు అమలు చేయకుండా మోసం చేశారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ విమర్శించారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో ముఖ్య నేతలతో ఆదివారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడాది పాలనలో వృద్ధులకు కొత్త పింఛన్లు ఇవ్వలేదన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఇచ్చిన పింఛన్ల కోత వేసి కొత్తగా ఇచ్చిన పాపాన పోలేదని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం వృద్ధులకు నెలకు రూ.3 వేలు పింఛన్ ఇస్తే, కూటమి ప్రభుత్వం మరో రూ.వెయ్యి అదనంగా కలిపి రూ.4 వేలు మాత్రమే ఇచ్చి గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంతో ప్రభుత్వం ఎందుకు సంకోచిస్తుందో అర్థం కావడం లేదన్నారు. రెండేళ్ల పాటు ప్రపంచ వ్యాప్తంగా కరోనాతో తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, మన రాష్ట్రంలో మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసి వారి గుండెల్లో నిలిచిపోయారన్నారు. వైఎస్సార్‌సీపీలో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం నూతన రాష్ట్ర కార్యదర్శిగా పదవి బాధ్యతలు స్వీకరించిన మలసాల కుమార్ రాజాను 80వ వార్డు ఇన్‌చార్జ్ కె.ఎం.నాయుడు, రాష్ట్ర గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, పార్టీ కార్యకర్తలు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, 83వ వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, సీనియర్ నాయకులు దాడి నారాయణ రావు, పిల్లా రాజు, గైపూర్ రాజు, పెంటకోట శ్రీను, మొగలపల్లి సుబ్బారావు, శ్రీధరాల మనోజ్, మున్నూరు శ్రీను, ఆడారి శ్రీను, సూరిశెట్టి సత్తిబాబు, కొణతాల గోవింద్, హైమావతి, కాండ్రేగుల తులసి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

జిల్లా రిసోర్స్ కేంద్రం ఏడీఏ సుబ్రహ్మణ్యం


మాట్లాడుతున్న జిల్లా రిసోర్స్ కేంద్రం ఏడీఏ సుబ్రహ్మణ్యం

కశింకోట: వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా రిసోర్స్ కేంద్రం ఏడీఏ సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని జెట్టపురెడ్డితుని, నూతలుగుంట పాలెం గ్రామాల్లో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం, జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి నారు వేసుకునేటప్పుడు శుద్ధి చేసిన విత్తనాలు నాటుకోవాలన్నారు. ఉద్యానవన విస్తరణాధికారి ప్రవీణ మాట్లాడుతూ ఉద్యానవన పంటల సాగుకు బిందు సేద్యం లాభదాయకంగా ఉంటుందన్నారు. ఏవో ఎం. స్వప్న మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. బీసీటీ కృషి కేంద్రం భూసార పరీక్ష శాస్త్రవేత్త బి.శ్రీహరిరావు మాట్లాడుతూ రైతులు సహజ సిద్ధమైన ఎరువులు వినియోగించి పంటలు సాగు చేయాలన్నారు. దీనివల్ల భూమి ఆరోగ్యవంతంగా ఉండటంతో పాటు ఆరోగ్యకర ఉత్పత్తులు ప్రజలకు అందుతాయన్నారు. పశు వైద్య శాస్త్రవేత్త విజయ రాజ్ఞి మాట్లాడుతూ పశుగ్రాసం సాగులో యూరియా ఎరువు శాతాన్ని తగ్గించి జీవన ఎరువులు, పశువుల గెత్తం ఉపయోగించాలని రైతులకు సూచించారు.


కంప్యూటర్ అక్షరాస్యత ఎంతో అవసరం

ఎన్టీఆర్ ఆస్పత్రి వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు


కంప్యూటర్ శిక్షణలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన డాక్టర్ కృష్ణారావు

అనకాపల్లి: భవిష్యత్తు కృత్రిమ మేధ, వర్చువల్ రియాలిటీ, రోబోటిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ మొదలగు ఆధునిక రంగాలదేనని ఎన్టీఆర్ ఆస్పత్రి వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ కె.కృష్ణారావు తెలిపారు. స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో శనివారం రాత్రి కంప్యూటర్ శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్ని విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిజిటల్ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం 'ప్రధాన మంత్రి గ్రామీణ్ డిజిటల్ సాక్షరతా అభియాన్' యోజన సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశంలో 38 శాతం కుటుంబాలకే డిజిటల్ అక్షరాస్యత ఉందని, ఇంటర్నెట్, విద్యుత్తు సదుపాయాలు సరిగ్గా లేకపోవడం, బోధకుల కొరత కంప్యూటర్ విద్యకు అవరోధాలుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం దైనందిన జీవితంలో అంతర్భాగమైందన్నారు. ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, అంతర్జాల సదుపాయం లేనిదే రోజు గడవడమంటే అతిశయోక్తి కాదన్నారు. సాంకేతికతల ద్వారా ప్రయోజనాలను అందిపుచ్చుకోవడం ఎంత అవసరమో, సైబర్ మోసాలకు చిక్కకుండా జాగ్రత్తపడటమూ అంతే కీలకమన్నారు. అందుకోసం కంప్యూటర్ అక్షరాస్యత ఎంతో అవసరమన్నారు. రానున్న దశాబ్ద కాలంలో 'వెబ్-3 సెక్టార్' భారత్‌లో 22 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలను సృష్టించనుందని 'అన్ లాకింగ్ ద వెబ్-3 పొటెన్షియల్' తాజా అధ్యయనం వెల్లడించిందన్నారు. కంప్యూటర్ యంత్రం ... భవితకు మంత్రంగా మారిందన్నారు. కంప్యూటర్ ఆవశ్యకత పెరిగిన నేపథ్యంలో గౌరీ గ్రంథాలయం 17 ఏళ్లుగా విద్యార్థులకు వేసవి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. కంప్యూటర్ కోర్సుల్లో చేరడం వల్ల ఇంగ్లిషు భాషపై పట్టు వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, అధ్యక్షుడు డి.నూక అప్పారావు, మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, కంప్యూటర్ శిక్షకులు శరగడం కిశోర్ బాబు, యు.వినీల, కె.లక్ష్మి, గ్రంథాలయ సభ్యులు కాండ్రేగుల సత్యనారాయణ, బొడ్డేడ జగ్గఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో ముత్యాలరాజు


కమిషనర్‌కు అప్పన్న చిత్రపటాన్ని అందిస్తున్న సూపరింటెండెంట్ త్రిమూర్తులు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ముత్యాలరాజు సతీసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో అర్చకులు అష్టోత్తర పూజ నిర్వహించారు. అనంతరం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటాన్ని పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు అందించారు.

నూకాంబిక ఆలయంలో భక్తుల రద్దీ


గవరపాలెం నూకాంబిక అమ్మవారు


నూకాంబిక అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్లో భక్తులు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారిని ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడాది అమ్మవారి కొత్త అమావాస్య జాతరను రాష్ట్ర పండగగా ప్రభుత్వం గుర్తించడంతో ఆలయానికి భక్తులు తాకిడి పెరిగింది. శనివారం రాత్రి కొంతమంది భక్తులు వారి స్వగృహాలు వద్ద అమ్మవారి పాట నిర్వహించి, ఆదివారం ఉదయం 8 గంటలకు కుటుంబ సమేతంగా ఇక్కడ ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మరి కొంతమంది భక్తులు అమ్మవారి ఆలయ సమీపంలో చలువ పందిళ్ల వద్ద కుటుంబ సమేతంగా వంటలు చేసుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సహాయ కమిషనర్ వెంపలి రాంబాబు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు తాగునీరు, అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగ శ్రీను (గొల్లబాబు), ఆలయ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం


బాలుడు చదువుకు జాయినింగ్ లేఖ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కశింకోట: నరసింగబిల్లి హైస్కూలుకు చెందిన పూర్వ విద్యార్థుల ఔదార్యం చాటుకున్నారు. తమ తోటి విద్యార్థిని కుమారుడిని సొంతం ఖర్చుతో చదివిస్తూ అండగా నిలుస్తున్నారు. 2007-08 టెన్త్ బ్యాచ్‌కు చెందిన మారిశెట్టి భారతి ఎనిమిదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు ప్రసాద్ అనే కుమారుడు ఉన్నాడు. అమ్మమ్మ, తాతయ్య చేరదీసి సాకుతున్నారు. వారిది పేద కుటుంబం కావడంతో చదివించడానికి స్తోమత లేదు. ఈ విషయాన్ని తెలుసుకున్న పూర్వ విద్యార్థులు విరాళం సమకూర్చి రెండేళ్లుగా ప్రైవేటు స్కూలులో చేర్పించి చదివిస్తున్నారు. ఈ ఏడాది 3వ తరగతి చదివించడానికి ఫీజు సమకూర్చి చదివించడానికి నిర్ణయించినట్లు, ఈ మేరకు స్కూలు జాయినింగ్ లేఖ అందించినట్లు ఆదివారం పూర్వ విద్యార్థులు తెలిపారు.